కబ్జా కోరల్లో కాల్వలు

- చంద్రయ్య డ్రెయిన్ రెగ్యులేటర్ కాల్వలను ఆక్రమించుకున్న వైనం
- కాల్వలను పూడ్చి వ్యాపార సముదాయాల నిర్మాణం

చంద్రయ్య డ్రెయిన్ రెగ్యులేటర్ కుడి, ఎడమ కాల్వలను చేపలు చెరువుల యజమానులు ఆక్రమించుకున్నారు. కాల్వలు రూపురేఖలు కోల్పోయాయి. దీంతో వందల ఎకరాలకు నీరు ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.


కాల్వను పూడ్చి చేపల చెరువుగా మార్చిన ఆక్వా రైతు

గుడివాడరూరల్: వందలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు చంద్రయ్య డ్రెయిన్ అనుబంధంగా పోలుకొండ రెగ్యులేటర్ వద్ద ఏడు దశాబ్దాల క్రితం తవ్విన కుడి, ఎడమ కాల్వలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. యథేచ్ఛగా కాల్వలను పూడ్చేసి చేపల చెరువుల్లో కొందరు కలిపేసుకున్నారు. మరి కొందరు కాల్వలను పూడ్చి వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేశారు. ఫలితంగా వందలాది ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం మారింది.

1949 సంవత్సరంలో నిర్మాణం

పోలుకొండ గ్రామం వద్ద చంద్రయ్య డ్రెయిన్‌పై 1949 సంవత్సరంలో మండవల్లి, గుడివాడ రూరల్, నందివాడ మండలాలకు సాగునీరు, రవాణా సౌకర్యం నిమిత్తం రైతుల సహకారంతో ప్రభుత్వం రోడ్డు, రెగ్యులేటర్ నిర్మించింది. దీని వలన వేలాది ఎకరాలకు సాగునీరుతో పాటు మురుగు నీరు పోయేందుకు మార్గం వీలైంది. రెగ్యులేటర్ వద్ద నీరు ఎక్కువ అయినప్పుడు షట్టర్లు ఎత్తి నీటిని దిగువకు వదలడం


రెగ్యులేటర్ సమీపంలో ఎడమ కాల్వను పూడ్చి ఏర్పాటు చేసిన గోడౌన్

వలన వృథాగా నీరు పోతుండటంతో రెగ్యులేటర్ వద్ద నుంచి చంద్రయ్య డ్రెయిన్‌కు కరకట్టకు ఇరువైపులా కుడి, ఎడమ కాల్వలను ఏడు కిలోమీటర్ల మేర తవ్వారు. దీని వలన నందివాడ, మండవల్లి మండలాల్లోని 1,438 ఎకరాలకు సాగునీరు అందేది.

చేపల చెరువులుగా తవ్వేశారు

రెండు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో పంట భూములను చేపల చెరువులుగా తవ్వేశారు. చేపల చెరువులకు సైతం ఈ కాల్వల ద్వారే సాగునీరు అందేది. కొద్దికాలంగా చేపల చెరువుల యజమానుల కన్ను పంట కాల్వలపై పడింది. నిబంధనల ప్రకారం కాల్వల కరకట్టలకు ఆరు మీటర్ల మేర దూరం వదిలి చేపల చెరువుల కరకట్టలను నిర్మించుకోవాలి. యజమానులు నిబంధనలను తుంగలో తొక్కి కాల్వల కరకట్టలను చేపల చెరువుల కరకట్టలుగా మార్చేసుకున్నారు.

కాల్వలనే చెరువుల్లో కలిపేశారు

చెరువుల మరమ్మతుల పేరిట ఏకంగా కాల్వలనే కబ్జా చేసి చెరువుల్లో కలిపేశారు. కైకలూరుకు చెందిన ఆక్వా రైతు అందరికంటే నాలుగు ఆకులు ముందే చదివి ఎడమ కాల్వను సుమారు కిలో మీటరు మేర తన చెరువుల్లో కలిపేశారు. గుడివాడకు చెందిన మరొక ఆక్వా రైతు తన చెరువు పక్కనే ఉన్న కాల్వను రొయ్యల చెరువుగా మార్చి యథేచ్ఛగా సాగు చేస్తున్నారు. మరికొందరు కాల్వలను పూడ్చేసి చేపల గోడౌన్‌లు కట్టేశారు. కుడి కాల్వను గాజులపాడు సమీపంలో విజయవాడకు చెందిన ప్రముఖ చేపల రైతు కిలోమీటరు మేర పూడ్చి చెరువుగా మార్చేశాడు. రెగ్యులేటర్ సమీపంలో మరో వ్యక్తి కాల్వను పూడ్చి వ్యాపార సముదాయాన్ని ఏర్పాటు చేశారు. ఆక్రమణల వలన కుడి, ఎడమ కాల్వలు రూపురేఖలు కోల్పోయాయి. ఇంత జరిగినా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలున్నాయి. ముడుపుల మత్తులో జోగుతూ కబ్జా దారులకు అధికారులు అండదండలుగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి కబ్జాలను తొలగించి కాల్వలను కాపాడాలని రైతన్నలు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ అధికారులను సంప్రదించగా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం.

ఆక్రమణలు తొలగించాలి



ఏడు దశాబ్దాల క్రితం రైతులకు మేలు చేసే ఉద్దేశంతో వృథాగా పోతున్న చంద్రయ్య డ్రెయిన్ నీటిని సాగుకు అందించేందుకు తవ్విన కాల్వలను కబ్జా చేయడం దారుణం. అసైన్డ్‌మెంట్ భూములతో పాటు ఇలా అడ్డగోలుగా నందివాడ మండలంలో కబ్జాలు ఎక్కువయ్యాయి. అధికారుల నిర్లక్ష్యమే కబ్జాలకు కారణం. ఆక్రమణలు తొలగించి కాల్వలను వెంటనే పునరుద్ధరించాలి.

– ఆర్పీపీ రెడ్డి, సీపీఎం నాయకుడు

జిల్లా అధికారులు స్పందించాలి



సాగునీరు అందించే కాల్వలను రైతులు, పెద్దలు అప్పట్లో చందాలు వేసుకుని తవ్వించారు. ఈ కాల్వల ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందేది. చెరువులు తవ్విన తర్వాత క్రమేపి అడ్డగోలుగా చేపల చెరువుల యజమానులు కాల్వలను కబ్జా చేసి చేపలు, రొయ్యల చెరువుల్లో కలిపేసుకున్నారు. అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలి.

– ఎం.బాపూజీ, రైతు, తమిరిశ

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ టౌన్: గుడివాడ సబ్ స్టేషన్ 160 ఎంవీకే పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక మరమ్మతులు చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ ఎస్.కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. మరమ్మతులు ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 8వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాగా సాధారణ విద్యుత్ సరఫరాకు ఏ విధమైన అవాంతరాలు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేశామని తెలిపారు. అవసరం అయితే పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట ఉపకేంద్రాల నుంచి విద్యుత్ సరఫరా తీసుకుని ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. అనుకోని పరిస్థితుల్లో కొంత మేరకు అంతరాయం ఏర్పడితే వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పామర్రులో..

పామర్రు: గుడివాడలో 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక మరమ్మతులు చేయాల్సి ఉన్నందున సోమవారం ఉదయం 9గంటల నుంచి ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈఈ మోహనకృష్ణారావు ఆదివారం తెలిపారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: లింగవరం సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం పెదపాలపర్రు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీవీ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి అధికమైంది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



గుడివాడ టౌన్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ విద్యార్థి బంగారు పతకం సాధించినట్లు కేకేఆర్ గౌతమ్స్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ ఆదివారం తెలిపారు. గత నెల విజయవాడలో జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థి చరణ్ రుత్విక్ 66 కిలోల విభాగంలో 265 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం సాధించారని తెలిపారు. త్వరలో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో తమ విద్యార్థి పాల్గొనే అవకాశం కైవసం చేసుకున్నారని తెలిపారు. ఇంతటి ప్రతిభను ప్రదర్శించిన చరణ్ రుత్విక్‌ను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

సంక్రాంతి సంబరాలు



గుడివాడ టౌన్: గుడివాడ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను కొత్త తరాలకు తెలియజేసేందుకు సంక్రాంతి సంబరాలు నిర్వహించామని క్లబ్ అధ్యక్షుడు టీఎస్. రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు, భోగిమంటలు, చిన్నారులకు భోగి పళ్లు, మహిళలకు గాజులు, కోడిపుంజుల కోలాహలం, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కథాకాలక్షేపం, ఎద్దుల బండిపై చిన్నారుల విహారం తదితర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఫెలోషిప్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అజయ్‌రాజు, కార్యదర్శి జి. కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గణేష్‌కుమార్



మండవల్లి: ఆర్‌టీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గణేష్‌కుమార్‌ను అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి ఆదివారం నియమించారు. గుంటూరులో జరిగిన ప్రజాసంకల్ప వేదిక రాష్ట్ర నూతన కార్యవర్గసభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా ఎనిమిది విభాగాల్లో రాష్ట్ర అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను నియమించారు. ఆర్‌టీఐ విభాగానికి గణేష్‌ను నియమిస్తూ నియామక పత్రాలను ఆయన అందజేశారు. వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలు కొనసాగుతుందని ధ్రువీకరించారు.

నగర సంకీర్తన



మండవల్లి: మండవల్లిలో కొలువైన శ్రీదత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వెళ్లి భిక్ష స్వీకరించారు. గుడివాడ చిట్టిబాబు, వెంకయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ స్వామికి లక్ష తులసీదళ పూజ



ఉరుటూరు(పామర్రు): గ్రామంలోని శ్రీ సీతారామస్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసీ పూజా కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. లక్ష తులసీ దళార్చనను 15 మంది రుత్విక్కులతో చేశారు. ఆలయ ప్రాంగణంలో మహా శాంతి హోమం తదుపరి మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆచార్య ఆశీర్వచనం నిర్వహించారు. ఆలయ అర్చకులు రొంపిచర్ల ఉపేంద్ర లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం


చినపులిపాకలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

తోట్లవల్లూరు: గుంతలు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని చినపులిపాకలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న వల్లూరుపాలెం-కంకిపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం ప్రారంభించారు. అనంతరం బొడ్డపాడులో రూ.1.65 లక్షలతో నిర్మించనున్న రచ్చబండ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ మూడే శివశంకరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి శోభ


సంక్రాంతి నేపథ్యంలో పిండి వంటలు వండుతున్న గృహిణులు


ఇంటిముందు రంగవల్లిలో ఉంచిన గొబ్బెమ్మలు

పామర్రు: గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ వాతావరణం సంతరించుకుంది. దీంతో లోగిళ్లు కళకళలాడుతున్నాయి. పండుగ 10 రోజులే ఉండటంతో ఇళ్ల ముందు మహిళలు గొబ్బెలను పెట్టి ఉదయాన్నే పూజలు చేస్తున్నారు. పెద్ద పండుగ కావడంతో ధాన్యం సిరులు ఇంటికి చేర్చుకున్నారు. పండుగ నేపథ్యంలో పిండి వంటలు వండుకునే సంప్రదాయం నెలకొన్నది. ముఖ్యంగా అరిసెలు, చెక్రాలు, జంతికలు, కారపు పూస తదితరాలను తయారు చేస్తున్నారు. కొత్త అల్లుళ్లు వస్తారని ఇళ్లను రంగ రంగులతో అలంకరించి ముస్తాబు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు కైలే పరామర్శ


వల్లూరుపాలెంలో పరామర్శిస్తున్న కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని వల్లూరుపాలెంలో పలు కుటుంబాలను ఆదివారం రాత్రి ఆయన పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన వాడపల్లి అల్లీబి(80), సువర్ణగంటి వెంకటేశ్వరరావు(70) కుటుంబాలను అనిల్‌కుమార్ పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్తలు దాసరి వెంకటేశ్వరరావు, డొక్కు వెంకటేశ్వరరావును పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు అనురాధ, మాజీ బ్యాంకు అధ్యక్షురాలు మురారి గంగమ్మ, నాయకులు నడకుదురు రాజేంద్ర, చింతలపూడి గవాస్కర్‌రాజు, ఈడ్పుగంటి రూబెన్, పొత్తూరి రవి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు


విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం గుడ్లవల్లేరు పాలిటెక్నిక్‌లో చదువుతున్న 85 మంది బీసీ హాస్టల్ విద్యార్థినులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఎన్.ప్రసాద్ ఆర్థిక వితరణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి. ప్రసాద్, పరంధామయ్య పాల్గొన్నారు.

రేకుల ఇల్లు దగ్ధం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని వెంట్రప్రగడ శివారు పెదదళితవాడలో ఆదివారం జరిగింది. గ్రామ వీఆర్వో ఫణి కథనం గ్రామానికి చెందిన దగాని లక్ష్మీరాజ్యం ఆదివారం ఉదయం ఇంట్లో ఉన్న విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావటంతో ఒక్కసారిగా మంటలు రేగి ఇల్లు కాలిపోయింది. రూ.50 వేల నగదు, బంగారం మొత్తం కలిపి రూ.లక్షకు పైగా ఆస్తినష్టం జరిగిందని వీఆర్వో తెలిపారు.

దాతలకు సత్కారం



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం వార్షికోత్సవం స్థానిక జగన్నాథపురంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది సేవాసంఘం చేపట్టిన సమాజసేవ కార్యక్రమాలకు సహకరించిన దాతలను సంఘం సభ్యులు సత్కరించారు. సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, పర్వతనేని ఆనంద్, బొగ్గారపు తిరుపతయ్య, పి. రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిమందిర వార్షికోత్సవం



తోట్లవల్లూరు: శ్రీసాయినాథుని ధ్యాన మందిర వార్షికోత్సవ వేడుకలు మండలంలోని బొడ్డపాడులో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబా విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఆటల పోటీలు

తోట్లవల్లూరు: సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు, జూదానికి వ్యతిరేకంగా భారత యువజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పెనమకూరులో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధి మరీదు యోహాను తెలిపారు. 13న పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్, సైకిల్ స్లో, మోకు లాగుడు, సీనియర్స్ షటిల్, 14న రంగవల్లులు, 15న బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. గత ఏడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99480 56094, 97038 93819 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాయామంతో ఎముకల ఆరోగ్యం


డాక్టర్ సాయికృష్ణను సన్మానిస్తున్న వాకర్స్

పెనమలూరు: ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం, ఆహారపు అలవాట్లు చాలా అవసరమని డాక్టర్ కాట్రగడ్డ సాయికృష్ణ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, వాకర్స్ క్లబ్, రియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎముకల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ మనిషికి 50 సంవత్సరాల వరకు బోన్‌మాస్ పెరుగుతుందని అన్నారు. ఆ తరువాత బోన్ మాస్ తగ్గటంతో ఆస్టియోపోరోసిస్ వ్యాధి వస్తుందన్నారు. దీంతో ఎముకలు బలహీనపడి దెబ్బతింటాయన్నారు. ఆడవాళ్లలో ఈ వ్యాధి వస్తుందన్నారు. దీని కారణంగా ఎత్తు తగ్గిపోవటం, నొప్పులు రావటం జరుగుతుందని వివరించారు. శారీరక వ్యాయామం, ఆహారపు అలవాట్లతో సమస్యను అధిగమించవచ్చన్నారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు బోన్ సాంద్రత పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు రూప్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి


లంక వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. పెనమకూరు దక్షిణ ఎస్సీ వాడ మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం లంక వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం ఆదివారం జరిగింది. గరికపర్రు సాయిబాబా కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో లంక వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ దంపతులను మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సన్మానించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి కూడా లంక వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు పెనుమత్స రాధిక, మూడే శివశంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు నడకుదురు రాజేంద్ర, చింతలపూడి గవాస్కర్‌రాజు, మాజీ సర్పంచ్ చాగంటి అంజిరెడ్డి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

కొర్నేలియస్‌కు సత్కారం


కొర్నేలియస్‌ను సత్కరిస్తున్న అంబేద్కర్ అభిమానులు

గుడివాడ టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో కలసి వసతిగృహం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయుడికి అంబేద్కర్ అభిమానులు ఆదివారం సత్కారం చేశారు. స్థానిక రాజేంద్రనగర్‌లో బాలబాలికల విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వసతి గృహానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అలనాడు శంకుస్థాపన చేశారు. అదేరోజు అంబేద్కర్ హాస్టల్ విద్యార్థులతో కలసి ఫొటో దిగారని, ఆ ఫొటోలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిగా పులవర్తి కొర్నేలియస్ కూడా భాగస్వామి కావడం అభినందనీయం అని అంబేద్కర్ అభిమానులు పేర్కొన్నారు. అంతటి భాగ్యాన్ని కలిగిన కొర్నేలియస్‌ను అభినందించడం తమ కర్తవ్యంగా భావించి వారికి చిరు సత్కారం చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ సువర్ణరాజు, బి. గోవర్ధనరావు, దాసు, మోహన్‌రావు, సీహెచ్ జోషి, రావూరి చిన్నా పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ ఒక్కరోజు ఆదాయం రూ.27,715

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో పలు విక్రయాల ద్వారా అమ్మవారికి ఆదివారం ఒక్క రోజు రూ.27,715 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన శాల, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూ ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి ఫొటోల విక్రయాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమకూరుస్తున్నామని ఈఓ తెలిపారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని వల్లభనేని వీరభద్రరావు జయంతిని పురస్కరించుకుని వారి కుమారుడు రామకృష్ణ ఆర్థికసాయంతో నిర్వహించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొట్లూరి రవి, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్ పాల్గొన్నారు.